
# ఢిల్లీలో మేమే గెలుస్తాం



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఎం వెంకయ్యనాయుడు ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి రావడానికి కాంగ్రెస్‌తో చేతులు కలపడంతోనే.. ఆప్ ప్రతిష్ట మంటగలిచిందన్నారు. ఎనిమిది పాలనతోనే

## ఆప్ తేలిపోయింది

ఆప్ తేలిపోయిందని అన్నారు. వేరే పార్టీల వద్ద డబ్బు తీసుకొని ఓట్లు మాత్రం మాకే వేయాలంటూ.. ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్ చేస్తున్న ప్రకటనలను ఆయన తప్పుపట్టారు. కాంగ్రెస్, ఆప్ ఓటు బ్యాంకు రాజకీయాలకు తెరతీశాయని ఆయన ఆరోపించారు. బీజేపీ తరుపున ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించిన కిరణ్‌బేడీ సమర్థురాలైన నేతగా కొనియాడారు. ఈ విషయాన్ని ప్రశాంత్ భూషణ్ ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. సెక్యులరిజం- సోషలిజం అంశాలపై ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగంలో ఈ రెండు పదాలు ఆదిలో లేవని తెలిపారు. నెహ్రూ, అంబేద్కర్, సర్దార్ పటేల్, గోపాలస్వామీ అయ్యంగార్ చర్చించి రాజ్యాంగంలో చేర్చారని చెప్పారు. ఎమెర్జెన్సీ తరువాత ఇందిరాగాంధీ ఓటు బ్యాంక్ రాజకీయాలకు పాల్పడి.. సెక్యులరిజం- సోషలిజంను ఉపయోగించుకున్నారని వెంకయ్య ఆరోపించారు.

### కాంగ్రెస్‌కు ఒక్క సీటు దక్కినా సంతోషించాలి: షానవాజ్ హుస్సేన్

**న్యూఢిల్లీ :** ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో గెలుపుపై బీజేపీ ఎంతో నమ్మకంతో ఉంది. ఆ విషయం ఆ పార్టీ నేతల మాటల్లో స్పష్టంగా కనిపిస్తోంది. పార్టీ అధికార ప్రతినిధి షానవాజ్ హుస్సేన్ ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ కాంగ్రెస్, ఏఏపీ మధ్య ఘర్షణవల్ల ఢిల్లీ ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. తాము ఏదో విధంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనుకుంటే గతంలోనే ఆ పని చేసి ఉండేవారమన్నారు. ప్రజల మీద తమకు ఎంతో నమ్మకం ఉందని, ఎందుకంటే వారు లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలోని మొత్తం ఏడు లోక్‌సభ స్థానాలనూ తమ పార్టీకి ఇచ్చారని, కాంగ్రెస్, ఏఏపీలను సున్నాకు పరిమితం చేశారని అన్నారు. ఢిల్లీ ప్రజలు తమతోనే ఉన్నారని, సోనియా మాటల ప్రభావం వారిపై ఉండబోదని తెలిపారు.